## 432 *Saviour, like a Shepherd lead us*

1. యేసు, మమ్ము నడిపించు
నీదు కాపు కావలెన్
నీవు మమ్మును బోషించు
మమ్ముఁ జేర్చు మందలోన్
యేసునాధా, ప్రియనాధా!
మమ్ము విమోచించుమా.

2. మమ్ము నాదరించు యేసూ
మాకు పాలకుండవు
పాప మార్గమందు నుండి
ప్రేమతో! దప్పించుమీ
యేసునాధా, ప్రియనాధా!
మొఱ్ఱ నాలకించుమా.

3. బీద పాపు లైన మమ్ము
నీ వంగీకరింతువు
మమ్మును బవిత్రపర్చి
మమ్ము విడిపించుమీ
యేసునాధా, ప్రియనాధా!
నిన్ను నాశ్రయింతుము

4. బాల్యమందు నిన్నుఁ జేరి
నిన్ను హత్తుకొందుము
ప్రియ రక్షకుండ, యేసూ
నీ ప్రేమఁ జూపుమా
యేసునాధా, ప్రియనాధా !
మమ్మింకఁ బ్రేమించుమా.

*అను : జేకబ్ చేంబర్లేన్*

# సహవాసము

## 433 క్రైస్తవానుభవము

రా – శంకరాభరణము తా–అట

యేసు నామం బెత్తి పాడుదమ = క్రీస్తు దాసులతోఁ బొత్తుఁ గూడు దమ ॥యేసు॥

1. ఇహసంబంధుల పొందుఁ జాలింతమ = మహా – మహుఁడౌ దేవుని యాజ్ఞఁ బాలింతమ ॥యేసు॥

2. శుభవార్తర్థము లన్ని శోధింతమ = యేసువిభు సత్యమిలలోన – నుభవింతమ ॥యేసు॥

3. దోషములను బైటఁ బెట్టుదము = కపట – వేషభాషలఁ గ్రుంగఁ బట్టు దమ ॥యేసు॥

4. మన రక్షకుని పాట్లు మది నెంతమ = మనసు – లోపలి గర్వము లణపుదమ ॥యేసు॥

5. జనుల నిందల కెల్ల నోర్చెదమ = బోధ – కనిపెట్టి ప్రభు చెంత నేర్చ దమ ॥యేసు॥

6. మానావమానముల్ భరియింతమ = యోర్వ – లేని గుణముల వేరుఁ బెరుకుదమ ॥యేసు॥

7. పరిశుద్ధాత్మను బొంద నడుగుదమ = బుద్ధి – పరమానందము జాడ నడుపు దమ ॥యేసు॥

8. సకల మానవు లాత్మ సరిచూతమ = యింక – మొక మిచ్చకపు మాట ల్విడిచెదమ ॥యేసు॥

9. దినము ప్రార్థనఁ జేయ గురి యుంతమ = చెడ్డ – మనసు బద్ధకముపై నెదిరింతమ ॥యేసు॥

10. గురు బోధ స్థలికి బిరబిరఁ బోదమ = బుద్ధి – తిర ముంచి వాక్యార్థ మెఱు గుదమ ॥యేసు॥

*– పురుషోత్తము చౌదరి*

## 434 క్రీస్తు దాసుల సహవాసము

రా – బేహాగ్ తా–రూపకము

యేసు భక్తవరులతో ని – వాసముందమ – యేసుదాసు లౌదమ ॥యేసు॥

1. దోసములను తీగలన్ని – కోసివేతమ –మిగుల – మోసపుచ్చు నాసలెల్ల – రోసివేతమ – యేసుదాసు లౌదమ ॥యేసు భక్త॥

2. దోసిలొగ్గి ప్రభునివేడ – [1]గాసి పడుదమ – వాసిగాను – యేసుమీద నాసపడుదమ– యేసు – దాసు లౌదమ ॥యేసు భక్త॥

3. జారచోర దుష్కృతములు – పారవేతమ – సత్య – సార మెరుగ బరమ గురుని – జేరు కొందమ – యింక – కోరు కొందమ ॥యేసు భక్త॥

4. [2]ప్రాపు లేనివారికెల్ల దా పొసంగును – యేసు – శాపరాసులన్ని తానే యోపి మోసెను – తండ్రి – దాపొసంగును ॥యేసు భక్త॥

[1]బాధ. [2]దిక్కు